మార్కెట్‌కు సంక్రాంతి శోభ

• కిటకిటలాడిన రోడ్లు



మార్కెట్లో రేగిపండ్లు, చెరుకు గడలను విక్రయిస్తున్న వ్యాపారులు

శ్రీకాకుళం కల్చరల్: సంక్రాంతి.. తెలుగు లోగిళ్లలో సరికొత్త క్రాంతి నింపే పండుగ. ఎక్కడెక్కడో ఉన్న వాళ్లు ఈ పండుగను ఘనంగా జరుపుకునేందుకు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. దీంతో పట్టణంలోని రోడ్లన్నీ రద్దీగా మారాయి. అలాగే ఆదివారం భోగి పండుగ జరుపుకునేందుకు మార్కెట్లో చెరుకు, రేగుపళ్లు, పూలు, కొబ్బరికాయలు, అరటిపళ్లు, పెద్దలకు బట్టలు పెట్టేందుకు కొనుగోళ్లు చేస్తున్న ప్రజలతో శనివారం పట్టణం కళకళ లాడింది. ఉదయం నుంచే పొట్టి శ్రీరాములు మార్కెట్, రైతుబజార్ వద్ద జనాలతో నిండిపోయింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన జనాలు పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. చిన్నరేగుపళ్లు పావుకిలో రూ.25, చెరుకు గడ రూ.20 చొప్పున విక్రయించారు. చిన్నారులకు భోగిపళ్లు పోసేందుకు ఎక్కువగా రేగు పళ్లు తప్పనిసరి కావడంతో ధర కూడా ఎక్కువ పలికింది. ఒక కొబ్బరికాయ రూ.25 చొప్పున విక్రయించారు. అలాగే బంతి పూలు కేజీ రూ.200, చామంతి రూ.300 చొప్పున అమ్మారు. అలాగే వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పట్టణంలోని అన్నిరోడ్లు జనాలతో రద్దీగా దర్శనమిచ్చారు.

నందడిగా సంక్రాంతి వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: రాయల్ డాన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని 80 అడుగుల రోడ్డులో క్లబ్ ఫౌండర్ పి.యోగేంద్ర, స్టార్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి బి.దేవిప్రసాద్‌లు సంక్రాంతి సంబరాలను శనివారం ప్రారంభించారు. ముందుగా రంగురంగుల గాలిపటాలను ఎగురవేశారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో రైతులు సాగుచేసిన కూరగాయలు, పప్పుదినుసులు, వరికంకులు, పువ్వులతో ముగ్గులను ఏర్పాటు చేశారు. అనంతర ం భోగి మంట వేసి చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో డాన్సు కొరియోగ్రాఫర్ జుంబ ట్రైనర్ రాంబాబు, హరీష్, భాను ప్రకాష్, రామకృష్ణ, డాక్టర్ రాంబాబు, జ్యోతి, నాని, బివిఎస్ సత్యన్నారాయణ శివ పాల్గొన్నారు.



సంప్రదాయ వస్త్రధారణలో యువత

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం



గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని శివబాలజీ ఆలయంలో ధనుర్మాస వ్రతం ముగింపు సందర్భంగా శనివారం గోదారంగనాథుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ప్రముఖ ఆగమ శాస్త్ర పండితులు చామర్తి జగన్నాథాచార్యులు, చామర్తి సీతారామాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు గోపినంబాళ్ల వేంకట సీతారామాచార్యుల అర్చకత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సమూర్తులను ఆలయ మండపంలో ఏర్పాటు చేసి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సంప్రదాయంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. 50 మంది దంపతులు కల్యాణ మహోత్సవ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తులసీరావు, మహేష్‌సామంత్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలను అందజేసిన మంత్రి ధర్మాన



మహిళకు పట్టాను అందజేస్తున్న మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో సానివాడ, సింగుపురం, తండేవలస, పెదపాడు, మునసబుపేట, రాగోలు గ్రామాలకు చెందిన పలువురు పేదలకు ఇట్టి పట్టాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరికీ సొంతిల్లు ఉండాలన్న భావనతో అర్హులైన వారందరికీ పట్టాలను అందజేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మందికి పట్టాలను పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో రూ.500 కోట్లు వెచ్చించి 20 వేల మందికి పట్టాలు అందజేసినట్లు వివరించారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి ధర్మానకు లైసెన్స్ సర్వేయర్ల వినతి



మంత్రి ధర్మానకు మొక్కను అందజేస్తున్న లైసెన్స్ సర్వేయర్లు

శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తమను ఆదుకోవాలని లైసెన్స్ సర్వేయర్లు కోరారు. ఈ మేరకు మంత్రి ధర్మాన ప్రసాదరావును శనివారం పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే మొక్కలను జ్ఞాపికగా అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో హేమసుందర్, సత్యం, శ్రీను, కాంతారావు, శేఖర్ ఉన్నారు.

శ్రీకూర్మనాథున్ని దర్శించుకున్న పలాస ఆర్డీవో



భరత్‌నాయక్‌కు ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథున్ని పలాస ఆర్డీవో భరత్‌నాయక్ కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీసన్నిధి, తాబేళ్ల పార్కు, రెండు ధ్వజస్తంభాలను సందర్శించారు. ఆలయ ఈవో జి. గురునాథం స్వామి ప్రసాదాన్ని అందజేశారు. అర్చకులు కిశోర్‌బాబు, నర్సుబాబు ఉన్నారు.

సరదాగా సంక్రాంతిని జరుపుకోవాలి

• డీఎస్పీ యర్రగుంట శృతి



శృతి

శ్రీకాకుళం క్రైమ్: ప్రజలంతా సంక్రాంతి పండుగను సరదాగా జరుపుకోవాలని శ్రీకాకుళం డీఎస్పీ యర్రగుంట శృతి కోరారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడదల చేశారు. పండుగ పేరుతో పేకాట, పిక్కాట, కోళ్లు, పొట్టేలు పందాలు నిర్వహించిన, అశ్లీల నృత్యాలను ఏర్పాటు చేసిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆరుబయట మద్యం తాగడం, తాగి వాహనాలు నడపరాదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలను తెలియజేశారు.

సీబీసీఎన్‌సీ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గం

శ్రీకాకుళం కల్చరల్: సీబీసీఎన్‌సీ నూతన కార్యవర్గాన్ని నామినేటెడ్ కమిటీ సభ్యుల సహకారంతో ఎన్నుకున్నట్టు ప్రతినిధి కె.రాజు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. 69వ మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో 2024–29 సంవత్సరాలకు గాను నామినేటింగ్ కమిటీ కన్వీనర్ జె.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మహాసభకు హాజరైన 52 బాప్టిస్టు సంఘాల రాయబారులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు పేర్కొన్నారు. అధ్యక్షులుగా పి.జార్జి ఎబినేజర్, కార్యదర్శిగా కె.కృపారావు, ట్రస్టు ఛైర్మన్‌గా హెచ్.ఎస్.పాల్, ఉపాధ్యక్షులుగా ఆర్.సావిత్రి, రికార్డింగ్ సెక్రటరీగా సీహెచ్ ప్రవీణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా వి.అనిల్ దేవదత్, లోపింటి చిట్టిబాబు ఉన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

రణస్థలం: జే.ఆర్.పురం పంచాయతీకి చెందిన 12 మందికి పారిశుద్ధ్య కార్మికులకు సంక్రాంతి పురస్కరించుకుని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు రాయపురెడ్డి శ్రీనివాసరావు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. పారిశుద్ధ్య సూపర్‌వైజర్ ఫణికుమార్ తదితరులు ఉన్నారు.

ఆదిత్యుని భక్తులకు పులగం ప్రసాదం



ప్రసాదం తయారు చేస్తున్న అర్చకులు

అరసవల్లి: ధనుర్మాసం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం వేకువజామున పులగం ప్రసాదాన్ని అర్చకులు తయారు చేశారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో భోగి ముందు రోజున పులగం ప్రసాద పంపిణీ చేయడం ఇక్కడ ఆనవాయితీ. కార్యక్రమంలో ఈవో వి.హరిసూర్యప్రకాష్, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వృద్ధులను ఆదుకోవడమే ఆదిత్య వాకర్స్ క్లబ్ లక్ష్యమని క్లబ్ అధ్యక్షుడు బురిడి గౌరీశంకర్ అన్నారు. వృద్ధజనాశ్రమంలో శనివారం 70 మందికి దుప్పట్లు, రగ్గులు అందజేశారు. క్లబ్ ప్రతినిధులు ఎస్.ఎస్.మూర్తి, ఆర్.వి.లక్ష్మి, ఎస్.ఆర్.ఐ.మహేష్, ఉషాసుందరిల సౌజన్యంతో వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలుమహంతి ఉమామహేశ్వరరావు, డాక్టర్ శ్రీనివాసపటాన్నయక్, వృద్ధజనాశ్రమ నిర్వాహకులు యు.వి.రమణ, బి.ఎ.ఎల్ ప్రసాద్, డాక్టర్ కె.సోమేశ్వరరావు, కె.కృష్ణమూర్తి, విజయలక్ష్మి, ఎస్.వి.ఆర్ మూర్తి, ఎస్ రామలక్ష్మి, జి.ఆర్.జి.నాయుడు, లక్ష్మణరావు, భానుమూర్తి, రేగిడి గోవిందరావు, సుందరరావు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

వెంకన్నకు పూలతో అలంకరణ



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా స్వామిని రకరకాల పూలతో, తులసిమాలలతో అలంకరణ చేశారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈవో మాధవి భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

రేపటి నుంచి భద్రమహంకాళి జాతర



భద్రమహంకాళి అమ్మవారు

రణస్థలం: ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పురస్కరించుకుని కోటపాలెంలోని భద్రమహంకాళి అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. జాతర మూడు రోజులూ భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సాంస్కృతిక, సినీ తారలతో డాన్స్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ఇంటింటికీ అయోధ్య అక్షతలు



అక్షతలు పంపిణీ చేస్తున్న రామభక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెంలో శనివారం అయోధ్య అక్షతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రామ భక్తులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి అక్షతలు అందజేశారు. గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా నిరాటోత్సవం



కొదండరామాలయంలో అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



కోదండరామాలయంలో అమ్మవారిని పెళ్లికూతురుని చేసేందుకు తరలి వెళుతున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పట్టణంలోని పలు ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గోదాదేవి అమ్మవారికి నిరాటోత్సవం ఘనంగా శనివారం జరిగింది. ఆదివారం గోదా రంగనాథుల కల్యాణం నిర్వహించడంలో భాగంగా ముందురోజు అమ్మవారిని పెళ్లి కూతురుగా అలంకరణ చేసి, అభిషేకాలు నిర్వహిస్తారు. కొదండ రామాలయంలో అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారిని సంప్రదాయబద్ధంగా పసుపుతో అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. అలాగే పాండ్రంగి వీధిలోని రామమందిరంలో కుడా గోదాదేవికి నిరాటోత్సవం జరిగింది. అర్చకులు వేదుల ప్రదీప్‌శర్మ ఆధ్వర్యంలో తిరుప్పావై పాశురాన్ని చదివారు. అనంతరం నిరాటోత్సవంలో భాగంగా అమ్మవారిని పెళ్లికూతురుగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పాండ్రంగివీధిలో నిరాటోత్సవం పాశురం చదువుతున్న భక్తులు

క్రికెట్‌లో సత్తాచాటిన నిద్దాం



విజేతగా నిలిచిన నిద్దాం సచివాలయం జట్టు

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాంగా నిర్వహిస్తున్న ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా మండల స్థాయిలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో నిద్దాం సచివాలయం యువకులు ప్రథమ స్థానం కైవాసం చేసుకున్నారు. వీరు నియోజకవర్గం స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ కె.నిశ్చల, ఎంఎస్‌ఓ కొంచాడ బెనర్జీ శనివారం తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఎస్.రాజారమేష్, సి.హెచ్.సురేష్, హరి, పొగిరి రాము, వెంకటన్నాయుడు, పీడీలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులతోనే ప్రజారోగ్యం



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

• రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పారిశుద్ధ్య కార్మికుల బాధలు తెలిసిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. కాబట్టే వారి సమస్యలు పరిష్కరించేందుకు ముందుకొచ్చారని చెప్పారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల జీతాలు పెంచమని ఎవ్వరు అడగలేదని అయినా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచారన్నారు. బాపూజీ కళామందిర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు సంక్రాంతి సందర్భంగా శనివారం మంత్రి ధర్మాన చేతులమీదుగా దుస్తులు పంపిణీ చేశారు. ప్రజల ఆరోగ్యాలు కాపాడేది పారిశుద్ధ్య కార్మికులేనన్నారు. పారిశుద్ధ్య కార్మికుల పనికి ఎంతిచ్చినా వారి కష్టాన్ని లెక్కకట్టలేమని స్వయానా సీఎం జగన్ అన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా పేదలపక్షాన ఉంటుందన్నారు. ఎంతోమంది విమర్శిస్తున్నా పేదల జీవన ప్రమాణాలు పెంచాలన్నదే తమ లక్ష్యమన్నారు. 75 ఏళ్ల తరువాత కూడా ఇంకా పేదవాడు పేదవాడిలాగే ఉండడం సరికాదన్న ఆలోచనతో ఏ కార్యక్రమం చేపట్టినా పేదలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలోనే 20 వేల మందికి ఇళ్ల పట్టాలు అందించామన్నారు. రోజంతా కష్టపడి సొంతగూటికి చేరాలనే ఆలోచన ప్రతిఒక్కరికీ ఉంటుందన్నారు. ఆ కోరికను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తీర్చిందన్నారు. ఏ ఊరి కెళ్లినా పేదలంతా తలెత్తుకుని తిరుగుతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ చల్ల ఓబులేసు, కళింగవైశ్య కార్పొరేషన్, శ్రీశయన కార్పొరేషన్ల ఛైర్మన్‌లు అంధవరపు సూరిబాబు, డి.పి.దేవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోణార్క్ శ్రీను, మండవల్లి రవి, చల్ల శ్రీను, భైరి మురళి, అంధవరపు రామూ పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులొద్దు

• జే.ఆర్.పురం సీఐ రామచంద్రరావు



సీఐ రామచంద్రరావు

రణస్థలం: సంక్రాంతికి గ్రామాలకు వచ్చే ద్విచక్ర వాహనదారులు, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణాలు చేయవద్దని జే.ఆర్.పురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.రామచంద్రరావు తెలిపారు. జే.ఆర్.పురం సీఐగా ఇటీవల వచ్చిన ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. సంక్రాంతి వేళల్లో కోడిపందేలు, జూదం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత అధిక వేగంతో ప్రయాణించి ప్రమాదాలకు గురికావద్దన్నారు. స్వగ్రామాలకు వెళ్లేవారు స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలన్నారు. ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జి.సిగడాం, లావేరు, ఎచ్చెర్ల, రణస్థలం పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఎస్ఐలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలో అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ఎస్సై వి.సత్య నారాయణ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. జూదం, కోళ్ల పందేలు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లు వెళ్లేవారు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. జాతీయ రహదారి ఆనుకుని పెంట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

జూద శిబిరాలపై పోలీసుల దాడి

ఎచ్చెర్ల: లావేరు మండలం శిగురుకొత్తపల్లి సమీపంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు శనివారం దాడి చేశారు. బొంతుపేట గ్రామానికి చెందిన ఐదుగురుని అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.30 వేల నగదు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రావివలస సమీపంలో జూద శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఆరుగుని అదుపులోకి తీసుకున్నారు.

వారి వద్ద నుంచి రూ.23 వేల నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. అదుపులోకి తీసుకున్న 11 మందిపై కేసు నమోదు చేశామన్నారు.

• పేదలకు వస్త్రదానం



వస్త్రాలు అందజేస్తున్న రమాదేవి

జి.సిగడాం: ఎస్సీఆర్‌పురంలో పేదలు, దివ్యాంగులకు వైఎస్సార్‌సీపీ మండల మహిళా కన్వీనర్, సర్పంచ్ కంది రమాదేవి సమక్షంలో జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ పేదలను ఆదుకోవడంలో జీఎంఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. గ్రామాభివృద్ధి కోసం యువతీ, యువకులు ముందడుగు వేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కంది సాయికిరణ్, జీఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.